క్లుప్తంగా

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు : మైలవరం మండలం కంబాల దిన్నెలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ చిన్నారిపై జరిగిన ఈ దుర్ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. చిన్నారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత మెగా మెడికల్ శిబిరం



వైద్యశిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీకృష్ణ శారద డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కడపకు చెందిన శ్రీకర హాస్పిటల్ డాక్టర్ రామానుజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో 175 మంది రోగులు పాల్గొన్నారు. పల్మనాలజీ, ఆర్థోపెడిక్, సర్జికల్ గ్యాస్ట్రో విభాగాలకు చెందిన వైద్యులు విశ్వేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాంపును విశ్రాంత డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ మార్కారెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి సందర్శించారు.


ఘనంగా దస్తగిరి స్వామి పండుగ



కొట్టాల గ్రామంలో దర్గా వద్దకు జెండాలను తీసుకెళుతున్న గ్రామస్తులు

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామంలో దస్తగిరి స్వామి పండుగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. దస్తగిరి స్వామి దర్గాను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం తప్పెట్లు, మేళతాళాలతో పలువురు జెండాలను ఎత్తుకొని దర్గా వద్ద ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించారు. గ్రామస్తులంతా కలిసి అంగరంగ వైభవంగా జరుపుకోవడం, బంధువులు, స్నేహితులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పదహారేళ్ల క్రితం జరుపుకున్న ఈ పండుగ మళ్లీ ఇప్పుడు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. రాత్రి డప్పు వాయిద్యాల నడుమ ఊతకడ్డీలతో ప్రత్యేకంగా అలంకరించిన చెట్టును దస్తగిరి దర్గా వద్ద ఉంచి ప్రార్థనలు చేసి ప్రసాదాన్ని పంచి పెట్టారు.

కుందూనదిలో పారుతున్న వర్షపు నీరు



చాపాడు సమీపంలో కుందూనదిలో పారుతున్న వర్షపు నీరు

చాపాడు : మండలంలో కుందూనదిలో వర్షపు నీరు ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా ఎగువ, దిగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ, ఓ మోస్తరు వర్షాల కారణంగా కుందూనదిలో వర్షపు నీరు చేరుతోంది. వేసవి కాలంలో గత కొన్ని రోజుల క్రితం నదిలో నీరు ఇంకిపోయింది. పలుచోట్ల గుంతల్లో నీటిని రైతులు తమ పంట పొలాల అవసరం కోసం మోటార్ల ద్వారా నీటిని తరలించుకున్నారు. దీంతో నదిలో నీటి జాడ కన్పించలేదు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాల వలన కుందూనదిలో నీరు పారుతుండడంతో రైతులు సంతోషిస్తున్నారు. జూన్ మాసంలో కుందూనది పరీవాహంలో పలు గ్రామాల్లో పసుపు పంటను రైతులు సాగు చేస్తారు. ఇప్పటికే పొలాల్లో పేడ ఎరువును చల్లుకుంటూ సేద్యాలు చేసుకుంటూ పసుపు విత్తు కోసం సిద్ధమవుతున్నారు.

పదోన్నతుల్లో పారదర్శకత పాటించాలి

జమ్మలమడుగు : ఉమ్మడి కడప జిల్లాల్లో జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు పదోన్నతుల్లో ప్రతిసారి అడక్వెన్సీ పేరుతో ఎస్సీల 15 శాతం కోటాను తగ్గించే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. ఎస్సీల కోటాలో ఏరకంగా ఎక్కువ మంది ఉన్నారో పూర్తి వివరాలతో రిజర్వేషన్లు వారిగా వెల్లడించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల హోదాతో సమానమైన ఎంఈఓ-2 పోస్టులను లెక్కించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీల, ఉప వర్గీకరణ కోటాను ఏవిధంగా భర్తీ చేస్తారో బహిర్గతపరచాలన్నారు. పదోన్నతుల్లో ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.

పరిష్కారం పరిహాసమేనా..!

- రెవెన్యూ సదస్సుల్లో మూకుమ్మడిగా అర్జీలు
- చేతులెత్తేసిన రెవెన్యూ అధికారులు



రంపాడు రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్ (ఫైల్)

కాశినాయన : ప్రజల వద్దకే ప్రభుత్వం.. అక్కడే సమస్యలకు పరిష్కారం అనే నినాదంతో కూటమి సర్కారు ఆర్భాటంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలకు అతీగతీ లేకుండా పోయింది. సదస్సుకు హాజరై వినతులు సమర్పిస్తే తమ బాధలు తీరుతాయనే తలంపుతో మండల ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. సదస్సుల్లో అవి వెంటనే పరిష్కారమవుతాయని ఆశపడ్డారు. కానీ వారి ఆశలు అడియాశలుగానే మారిపోతున్నాయి. రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఐదు నెలలు గడిచినా సమస్యలు కాలేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అర్జీలు స్వీకరించిన అధికారులు ఎప్పుడు పరిష్కరిస్తారు? ఎవరి పరిష్కరిస్తారు? ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారు అనే అంశాలపై రెవెన్యూ సదస్సుల్లో స్పష్టత ఇవ్వలేదు. రెవెన్యూ సమస్యలు అధిక శాతం జాయింట్ కలెక్టర్ పరిష్కారం చూపాలని క్షేత్రస్థాయి అధికారులు చెబుతుండటంతో గందరగోళం నెలకొంది.

వినతుల వెల్లువ

మండల వ్యాప్తంగా 2024 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల రెవెన్యూ సదస్సుల్లో 819 మంది వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క అర్జీ కూడా పరిష్కరించిన దాఖలాలు లేవు. వచ్చిన అర్జీల్లో సింహభాగం భూ వివాదాలు పరిష్కరించాలని, తమకు భూమి కేటాయించాలని, ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని అధిక శాతం ప్రజలు అర్జీలు సమర్పించుకున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో పేరు మార్పు, అసైన్డ్ భూమి తండ్రి పేరు మీద ఉండి తండ్రి చనిపోతే భార్య పేరు మీద మార్చాలని ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో సమస్యలు. మరోవైపు ఈ సమస్యలకు పరిష్కారం చూపడం తహసీల్దారు పరిధిలో కూడా లేదు. ఇటువంటి సమస్యలు జేసీ పరిధిలోనే పరిష్కారమవుతాయని, జేసీకి ఫైల్ పెట్టి పరిష్కరించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు మేము ఏమీ చేయలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. గ్రామంలోనే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడేమో ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చేంత వరకు మా చేతుల్లో ఏమీ లేదని అధికారులు చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. జాయింట్ కలెక్టర్ చేతిలో అధికారాలు ఉండటంతో తహసీల్దారు కార్యాలయాలకు ప్రాధాన్యం తగ్గిపోతుందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతుంది. ఎప్పుడో రిజిస్ట్రేషన్లు అయిన భూములు సైతం ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో ప్రజలు కాళ్లరిగేలా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు చూపలేక రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. ఈ మాత్రం దానికి సదస్సులు పెట్టడం దేనికని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుమూహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

జెడ్‌హెచ్‌డీసీ భూములకు రక్షణ కల్పించాలి



జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో పట్టాలు పొందిన దళితులు



జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో దళితులు వేసిన కంచెను ధ్వంసం చేసిన దృశ్యం

గోపవరం : మండలంలోని గోపవరం రెవెన్యూ పొలం 1854, 1855 సర్వే నెంబర్లలో దళితులకు కేటాయించిన జెడ్‌హెచ్‌డీసీ భూములకు రక్షణ కల్పించాలని దళితులు స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. 1999లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మడకలవారిపల్లెకు చెందిన 36 కుటుంబాలకు చెందిన దళితులకు ఒకటిన్నర ఎకరా చొప్పున ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వడం జరిగింది. అప్పట్లో సాగు కోసం ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లు కూడా వేయడం జరిగిందని, అయితే కరెంటు సౌకర్యం లేకపోవడంతో ఆ భూములను దళితులు సాగు చేయలేదు. కొన్ని సంవత్సరాలు మాత్రమే మెట్ట కింద పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఈ భూములు ఎలాంటి సాగుకు నోచుకోలేదు. అయితే మండలంలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ రావడంతో ఈ ప్రాంత భూములకు ఎక్కడా లేని డిమాండ్ వచ్చింది. దీంతో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా కబ్జాలకు గురవుతున్నారు. జెడ్‌హెచ్‌డీసీ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు స్థానిక దళితులు వారికి కేటాయించిన భూముల్లో చుట్టూ కంచె వేయడం జరిగింది. రెండు రోజుల క్రితం దళితులు వేసిన కంచెను శ్రీనివాసపురంకు చెందిన కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. దళితులకు ఇచ్చిన భూముల్లో అగ్రవర్ణాలకు చెందిన వారు దౌర్జన్యానికి దిగడంతో మా భూములకు రక్షణ కల్పించాలని మూకుమ్మడిగా దళితులు పోలీసు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జెడ్‌హెచ్‌డీసీ భూములకు రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులను కలుపుకుని ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని బాధిత దళితులు పేర్కొంటున్నారు.

జీవితాల్లో అనేక కథలు దాగున్నాయి

కథా రచయిత పలమనేరు బాలాజీ



కథావసంతం కార్యక్రమంలో పిల్లలతో కథా రచయితలు, జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : జీవితాల్లో అనేక కథలు దాగున్నాయని, వాటిని కథల్లో చెప్పగలిగితే సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని రాష్ట్ర తెలుగు భాషా పురస్కార అవార్డు గ్రహీత , కథా రచయిత పలమనేరు బాలాజీ తెలిపారు. స్థానిక జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో రెండో రోజు ఆదివారం పిల్లల కథా వర్క్‌షాప్ కథావసంతం 2కే25 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కథల్లో సామాజిక సంబంధాలు అనే అంశంపై పలమనేరు బాలాజీ మాట్లాడుతూ పుస్తకం మనిషిలోని ఆలోచనలను మారుస్తుందని, తద్వారా సమాజంలో మార్పు తీసుకువస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని చలనం ద్వారా వారిలోని సృజనను బతికించుకోవాలన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి, పబ్లికేషన్స్ కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ కాల్పనిక సాహిత్యంలో కథారచన చేసే సమయంలో తార్కికతకు అందని ఊహలు కథ చెప్పేందుకు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. కథలో ప్రధాన అంశాన్ని చెప్పేందుకు తోడ్పడే ఊహలో తార్కికతను కాక కథాంశం నెరవేర్చే ప్రయోజనం చూడాలని తెలిపారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.విజయ పప్పెట్ షో ద్వారా దురాశ దుఃఖానికి చేటు, నాన్న పులి అనే కథలను ప్రదర్శిస్తూ విజువలైజేషన్ ఎలా చేయవచ్చో వివరించారు. పప్పెట్ షో ద్వారా పిల్లల ఆలోచనలను, వారిలోని సృజనాత్మకతను పెంపొందించవచ్చని తెలిపారు. కథా రచయిత, రేడియో, టెలివిజన్ ప్రజెంటర్ మాధవీకళ మాట్లాడుతూ పిల్లల విజువలైజేషన్‌ను కామిక్స్ పిల్లలకు ఎలా అలవాటు చేయగలవో వివిధ కామిక్ పాత్రల ద్వారా సోదాహరణగా వివరించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ కథా వసంతం విజయవంతం అయ్యేందుకు కృషి చేసి అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రచయితలందరికి జేవీవీ గౌరవ సలహాదారులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కథా రచయిత దాదాహయత్, కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య, విరసం వరలక్ష్మి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీగుప్త, రాజేష్, శిరీష, వేంపల్లి రాజశేఖర్, ఉషారాణి, మధుసూదన్‌రెడ్డి, మీనా, దేవానంద్, జుబేదా, భరత్ నరసింహా, గౌతమ్, సోయబ్, గురు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ బోనాల్లో ఎమ్మెల్సీ

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ బోనాల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో గమిలిదేవత, నాగదేవత, పోలేరమ్మ, భైరవస్వామి, పోతురాజు సహిత పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట జరిగి 11 రోజుల సందర్భంగా గ్రామస్తులు పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన తేనేటి విందులో పాల్గొని పలువురు నాయకులను కలుసుకున్నారు. రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు తగదు

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డిపై కొన్ని మీడియా సంస్థలు పనికట్టుకుని అవినీతి ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలులోని చైర్మన్ నివాసానికి వచ్చిన ఆయన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుండి ఏవిధంగా ఉందో, రాజగోపాల్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎంత మేర అభివృద్ధి చెందిందో పట్టణంలో ఏ ఒక్కరిని అడిగినా చెబుతారన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేటాయించిన రూ.130 కోట్ల నిధులతో చేపట్టిన పనులలో అవినీతి జరిగిందని, చైర్మన్ తన కుటుంబ సభ్యుల ద్వారా పనులు చేశారని ఆరోపించడం తగదన్నారు. పనులకు సంబంధించి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టెండర్లలో రాజగోపాల్‌రెడ్డి సోదరుడు దశరథరామిరెడ్డి పనులు దక్కించుకున్నాడని, అయితే రాజగోపాల్ రెడ్డి, ఆయన సోదరుడు దశరథరామిరెడ్డి 20 ఏళ్ళ క్రిందటే వేరుపోయారని, అలాంటప్పుడు రాజగోపాల్‌రెడ్డికి ఏం సంబంధం ఉంటుందని అన్నారు. అవినీతి ఆరోపణలు, అభూత కల్పనలు సృష్టించడం ద్వారా ఆ పత్రికల పరువే పోతుందనే విషయాన్ని వారు గ్రహించాలని కోరారు.

తాగునీటి కుళాయిలు ధ్వంసం



తాగునీటి కుళాయిలు తొలగింపుతో బోసిగా కనిపిస్తున్న పైప్‌లైన్

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తాగునీటి కొరకు సింటెక్స్‌ట్యాంక్, కుళాయిలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనం చేశాక విద్యార్థులు అక్కడ చేతులు కడుక్కుని, నీరు తాగేవారు. ఒక్క విద్యార్థులే కాదు ఇతరులకు కూడా తాగేందుకు కుళాయిలు ఉపయోగపడుతూ వస్తున్నాయి. ఒకే ప్రాంగణంలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉన్నందున ఈ కుళాయిలు అందరికీ ఉపయోగపడేవి. నిన్నటి వరకు ఉన్న కుళాయిలు ఆదివారం మాయమయ్యాయి. బలాదూర్‌గా తిరిగే దుండగుల పనే ఇది అంటున్నారు కళాశాల మైదానంలో తిరిగే వాకర్స్. మార్నింగ్ వాకింగ్‌కు వచ్చి, పోయే టప్పుడు అక్కడ చేతులు కడుక్కునే వారమని, ఈ రోజు కుళాయిలు కనిపించడం లేదన్నారు. చాలాకాలంగా ఉన్నత పాఠశాల గదుల కిటికీలు పగుల కొట్టడం, ట్యూబ్‌లైట్లు పెరికి వేయడం జరుగుతోంది. అలాంటి వారిపై ఓ కన్నేసి ఉంచి, కటకటాల పాలు చేయాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి



ప్రొద్దుటూరు: యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు



ప్రొద్దుటూరు కల్చరల్: మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీ వరకు రోజు యోగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. ప్రజలందరూ యోగా శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురువులు మునిశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, విశ్వనాథ్‌రెడ్డిలు మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, ప్రజలతో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ ఒకటి నుంచి ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవలని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ యోగా ఉపాధ్యాయుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం భీమిలి బీచ్ రోడ్డు వేదికగా లక్ష మందితో యోగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నారన్నారు. ఇందులో భాగంగా అందరికీ యోగా అనే ఆలోచనతో జూన్ ఒకటి నుండి శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రామన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణకార్యక్రమం డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నారు. వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో మహిళలకు ఉదయం 6 నుంచి 4 గంటల వరకు మహిళా యోగా కార్యక్రమంలో స్వప్న మాతాశ్రీ శిక్షణ ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు మునిశేఖర్ గురూజీ 9642080829, రామమనోహర్ గురూజీ 7842353438, స్వప్న 8897082809, రమణ గురూజీ 8985543725, బాబు 9440114372, విశ్వనాథ ఆచారి 9000932269, తిరుపాలయ్య 9296800921 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఏవైయూఎస్ అధ్యక్షుడు మునిశేఖర్ గురూజీ,ప్రధాన కార్యదర్శి రామమనోహర్, ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమల ఏర్పాటు కోసం రైతుల నుంచి భూమి, ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా పరిశ్రమ నుంచి వెలువడే విష వాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ సరిగ్గా చేయకపోవడం వలన ఎర్రగుంట్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు పడుతున్నారు. కంపెనీ సామాజిక బాధ్యత నిధులు, విద్య వైద్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికి చేయకుండా దొంగ బిల్లులు చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కంపెనీలు సీఎస్ఆర్ నిధులు ఏఏ పనులకు ఖర్చుపెట్టారో ఎక్కడ ఖర్చు పెట్టారో బహిరంగ పరచాలన్నారు. సిమెంట్ పరిశ్రమలలో ఒప్పందం ప్రతిపాదికన కార్మికులను నియమించుకుంటూ చాలీచాలన జీతాలతో శ్రమ దోపిడీ చేస్తున్నారని, కార్మికులు జీతాలు పెంచాలని అడిగితే నిర్ధాక్షిణ్యంగా కార్మికులను తొలగిస్తున్నారని మండి పడ్డారు. సిమెంట్ పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, కనీసం వేతనం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరిసర ప్రాంతాల ప్రజలతో కలసి పెద్ద ఎత్తున పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


వైస్ చాన్స్‌లర్ ఉడత వెంకట బసవరావు




ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో వీసీ బసవరావు, ఏసీ మల్లికార్జున ప్రసాద్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉడత వెంకట బసవరావు పద్మశాలి పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీయ విద్యార్థులకు 27వ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివి దానిని సాధించాలన్నారు. పేదరికంలో ఉన్న తన తల్లిదండ్రులు మగ్గం నేస్తూ చదివించారని చదువు ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిభగల విద్యార్థులకు ప్రోత్సహించేందుకు అభ్యుదయ సంఘం పురస్కారాలను అందించడం అభినందనీయమన్నారు. ప్రతిభ గల విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. మొబైల్ వాడకాన్ని వీలైనంత తగ్గించాలని, విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నా వెంకట చంద్రబాబు మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో విద్యార్థులకు నగదు ప్రతిభా పురస్కారాలను అందిస్తున్నామన్నారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు, వనభోజనాలు, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అన్ని కులస్థుల 10 తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ, ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. 10వ తరగతిలో, ఇంటర్‌లో అన్ని గ్రూపుల్లో అత్యధిక మార్కులు, ఎంసెట్, జేఈఈ, నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అలాగే పదో తరగతిలో అత్యున్నత మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి పంపిణీ చేశారు. మొత్తం 80 మంది విద్యార్థులకు రూ.2.80లక్షలను పంపిణీ చేశారు. అలాగే ఐదు మంది 60 ఏళ్లు దాటిన చేనేత కళాకారులను రూ.2వేలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలీయ సంఘం కోకన్వీనర్ భీమునిపల్లి వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నా వెంకట కృష్ణయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గునిశెట్టి సునందన రాజశేఖర్, అభ్యుదయ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు సాధు అశోక్, ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, కోశాధికారి అవ్వారు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడలు నందం కుమార్, జలదుర్గం మునిస్వామి, కాల్వ ఆంజనేయులు, ఉమా నరసింహులు, జింకా రమేష్, రవి, భోగా ఆనంద్, కోటా సంజీవ, డాక్టర్ రాంప్రసాద్, సాధు గోపాల కృష్ణ, రమణయ్య, వీర, సింగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మొత్తుతో కొమ్ములు సురక్షితం



కుప్పగా పోసిన విత్తన కొమ్ములు




పసుపు కొమ్ములను మొత్తు వేసిన దృశ్యం

రాజుపాళెం : విత్తన పసుపు కొమ్ములకు మొత్తుతో సురక్షితంగా ఉంటాయని టంగుటూరు గ్రామ రైతులు అంటున్నారు. పసుపు పంట నూర్పిళ్ల తర్వాత కొమ్ములు నాణ్యతగా ఉంటే వాటిని కొంతమంది రైతులు అమ్ముకోకుండా చెట్ల కింది పేడ, మట్టి కలిపి కొమ్ములపై గాలిపోకుండా కప్పుతారు. అలాగ కప్పిన కొమ్ములు మొదట్లో ఎలా ఉంటాయో తిరిగి రెండు, మూడు నెలల తర్వాత కూడా అలాగే ఉంటాయని రైతులు చెబుతున్నారు. మరి కొంత మంది రైతులు ఇలా చేయడం కష్టమని, విత్తనం వేసేముందు విత్తన కొమ్ములను తెచ్చి విత్తనం వేస్తామని చెప్పారు. ఎంత నష్టం వచ్చినా అలవాటైన పంటనే సాగు చేస్తామని మండలంలోని టంగుటూరు గ్రామ రైతులు ఖరాఖండిగా చెబుతుండటం విశేషం. ప్రతిఏటా దాదాపు 210 ఎకరాలకు పైగా ఈ పంట సాగువుతుంది. అయితే కొన్ని ఏళ్లుగా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలామంది రైతులు ఏసీ గోదాముల్లో నిల్వ చేసినట్లు వారు తెలిపారు. ఈ ఏడాది ధరలు బాగుండటంతో ఈ పంట సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటా పసుపు ధర రూ.11,500 ఉన్నట్లు తెలిపారు.

మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జరిగే మోడల్ డీఎస్సీ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆదివారం ఎంఈఓ కార్యాలయంలో డీఎస్సీ నమూనా పరీక్ష కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులకు పరీక్ష ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవడంతోపాటు పోటీ పరీక్షల్లో తమ స్థాయి ఎమిటో తెలుస్తుందన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య



మాట్లాడుతున్న గురుదేవ్ రామిరెడ్డి, అమర్‌నాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతర్జాతీయ ప్రమాణాలతో ఎడిఫై పాఠశాల ద్వారా అత్యుత్తమ విద్యను అందించనున్నట్లు పాఠశాల యాజమాన్యం గురుదేవ్ రామిరెడ్డి, వై.అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదిత్యారాం కాంప్లెక్స్‌లోని ఎడిఫై పాఠశాల కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించేందుకు ఎడిఫై వారితో ఒప్పందం చేసుకుని 10 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో ఏసీ క్యాంపస్‌లో సీబీఎస్ఈ సిలబస్ బోధన చేస్తామన్నారు. పెద్దపెద్ద నగరాల్లో లభించే అత్యుత్తమ విద్యబోధనను తక్కువ ఫీజుతో అందిస్తామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. రాయలసీమలోనే మొదటగా రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్‌ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, డాన్స్‌రూం, మ్యూజిక్‌రూం, క్రికెట్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, సంగీతం రూంలను ప్రత్యేకంగా నెలకొల్పామన్నారు. ఈ నెల 31వ తేదీన ఉదయం 10.30 గంటలకు పాఠశాలను ప్రారంభిస్తున్నామని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, సి.ఆదినారాయణరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా చైతన్య రెడ్డి, ఎడిఫై పాఠశాలలడైరెక్టర్ ఏకే అగర్వాల్ తదితరులు హాజరవుతారన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్ పాల్గొన్నారు.